## గణపతి పూజలో పాల్గొన్న ఎంపీ



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్

మద్నూర్, అక్టోబర్ 3: మండలకేంద్రంలోని ఓంకార్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ బీబీపాటిల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన గణపతి పూజా కార్యక్రమంలో ఎంపీ పాల్గొన్నారు. అనంతరం ఆయన భక్తులకు స్వయంగా వడ్డించారు. గణేశ్ మండలి సభ్యులు.. ఎంపీని ఘనంగా సన్మానించారు. మద్నూర్‌లోని పాతబస్టాండ్ వద్ద నిర్మించిన బసవేశ్వర విగ్రహ దిమ్మెను ఎంపీ పరిశీలించారు. త్వరలో బసవేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బన్సీపటేల్, సర్పంచుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దరాస్ సురేశ్, గఫార్, మున్నూరుకాపు సంఘం మద్నూర్ అధ్యక్షుడు డాక్టర్ బండివార్ విజయ్‌కుమార్, ఉపసర్పంచ్ విఠల్, నాయకులు అక్షయ్‌పటేల్, పాండురంగ్ పాటిల్, ఈర్వంత్, శంకర్‌పటేల్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలందరికీ బతుకమ్మ చీరలు

- 18 ఏండ్లు నిండిన వారందరికీ ప్రతి ఏడాది పంపిణీ
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్
- తాడ్వాయి మండలంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభం
- యువతకు స్పోర్ట్స్‌కిట్ల పంపిణీ



బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

తాడ్వాయి, అక్టోబర్ 3: మండలంలోని బ్రాహ్మణపల్లి, తాడ్వాయి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే జాజాల సురేందర్ పలువురు మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 18 ఏండ్లు నిండిన మహిళలందరికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది బతుకమ్మ పండుగకు చీరలను పంపిణీ చేస్తున్నదని తెలిపారు. అనంతరం తాడ్వాయిలో పలువురు క్రీడాకారులకు కేసీఆర్ కిట్లను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రవి, జడ్పీటీసీ రమాదేవి, ఏఎంసీ చైర్మన్ సాయిరెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్‌రెడ్డి, సర్పంచ్ ఇందిర, ఎంపీటీసీ వెంకటరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిందర్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు రాజిరెడ్డి, నాయకులు రాజయ్య, చిరంజీవి, ధర్మపురి, వెంకట్‌రావు, శంకర్‌గౌడ్, సాయిరెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, రఘుపతిరెడ్డి, ఎంపీడీవో రాజ్‌వీర్, ఐకేపీ ఏపీఎం రవీందర్, కార్యదర్శి వీరేశ్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఆయన మండలంలోని ఆయా గ్రామాల్లో 18.90 కోట్ల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని అన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ రవి, జడ్పీటీసీ రమాదేవి, వైస్ ఎంపీపీ నర్సింహులు, ఏఎంసీ చైర్మన్ సాయిరెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిందర్‌రెడ్డి, ఎంపీటీసీలు జలంధర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజమణి, సర్పంచులు ఇందిర, జ్యోతి, రాణి, సంజీవు, స్వాతి, కవిత, నర్సారెడ్డి, పోరాజు, రాధ, బాల్‌చంద్రం, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# వంద శాతం రాయితీపై చేప పిల్లల సరఫరా

**జిల్లా మత్స్యశాఖ అధికారి వరదారెడ్డి**



చేప పిల్లలను పంపిణీ చేస్తున్న జిల్లా మత్స్యశాఖ అధికారి వరదారెడ్డి, నాయకుడు దుర్గారెడ్డి

నిజాంసాగర్, అక్టోబర్ 3: మత్స్యకార్మికుల జీవితాల్లో ఆనందం వెల్లివిరిసేలా వంద శాతం రాయితీపై ఉచితంగా చేప, రొయ్య పిల్లలను ప్రభుత్వం సరఫరా చేస్తున్నదని జిల్లా మత్స్యశాఖ అధికారి వరదారెడ్డి అన్నారు. నిజాంసాగర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండలంలోని 31 చెరువుల్లో విడుదల చేసేందుకు 5.89 లక్షల బొచ్చ, రోహు, మృగ రకాలకు చెందిన చేప పిల్లలను ఆయా గ్రామాల మత్స్యపారిశ్రామిక సంఘాల సభ్యులకు మంగళవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన అనంతరం ప్రభుత్వం ప్రతి సంవత్సరం చేప పిల్లలను ఉచితంగా సరఫరా చేస్తున్నదని చెప్పారు. జుక్కల్ నియోజకవర్గంలో 223 చెరువులు, కుంటల్లో కోటి 28లక్షల చేప పిల్లలను విడుదల చేయాలనే లక్ష్యం ఉండగా.. నిజాంసాగర్‌లో 45లక్షల చేప పిల్లలు, కౌలాస్‌నాలా ప్రాజెక్టులో ఐదు లక్షల చేప పిల్లలను ఈనెల 5న ఎమ్మెల్యే హన్మంత్‌షిండే విడుదల చేస్తారని చెప్పారు. మిగిలిన అన్ని చెరువుల్లో చేప పిల్లలను వంద శాతం విడుదల చేశామన్నారు. వీటితో పాటు నిజాంసాగర్‌లో 48లక్షలు, కౌలాస్‌నాలా ప్రాజెక్టులో 4.90లక్షల రొయ్య పిల్లలను విడుదల చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దుర్గారెడ్డి, వైస్ ఎంపీపీ మనోహర్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు విఠల్, అచ్చంపేట సొసైటీ చైర్మన్ నర్సింహారెడ్డి, నాయకులు నారాయణ, రమేశ్, దేవదాస్, సుభాష్, బెస్త రాములు తదితరులు పాల్గొన్నారు.

### గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను

# త్వరగా పూర్తిచేయాలి



పనులను పరిశీలిస్తున్న పిట్లం ఎంపీవో బ్రహ్మం

పిట్లం, అక్టోబర్ 3: మండలంలోని మద్దెల్‌చెరువు గ్రామంలో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీవో బ్రహ్మం అన్నారు. ఆయన మంగళవారం భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌కు పలు సలహాలు, సూచనలు చేశారు. పనులను నాణ్యతతో చేపడుతూ త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టిని సారించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ఆయన వెంట కాంట్రాక్టర్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య

తాడ్వాయి, అక్టోబర్ 3: మండలంలోని చందాపూర్ గ్రామానికి చెందిన అల్లూరి చిన్న నర్సారెడ్డి(35) మంగళవారం ఉదయం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై ఆంజనేయులు తెలిపారు. కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న నర్సారెడ్డి ఉదయం ఇంటి నుంచి వ్యవసాయ చేను వద్దకు వెళ్లాడు. కడుపునొప్పి బాధ భరించలేక చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై తెలిపారు. మృతుని భార్య సౌజన్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## స్వామీజీని దర్శించుకున్న నాయకులు



స్వామీజీతో నాయకులు

మద్నూర్, అక్టోబర్ 3:మండలకేంద్రానికి వచ్చిన నాచారం గుట్ట స్వామీజీ మధుసూదనానంద సరస్వతీని బీఆర్ఎస్ మండల నాయకులు మంగళవారం దర్శించుకున్నారు. స్వామీజీ ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బన్సీపటేల్, సర్పంచ్ దరాస్ సురేశ్, నాయకులు పాండురంగ్ పాటిల్, మారుతి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

### మంత్రి కేటీఆర్ పర్యటనకు

# భారీ పోలీసు బందోబస్తు



నాయకులకు సూచనలు ఇస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్పీకర్ పోచారం

బాన్సువాడ, అక్టోబర్ 3 : బాన్సువాడ పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల సందర్భంగా మంత్రి కేటీఆర్ బుధవారం విచ్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. వాహనదారులు, సభకు వచ్చే ప్రజలు పోలీస్ సిబ్బందికి సహకరించాలని బాన్సువాడ డీఎస్పీ జగన్నాథరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చే ప్రజలు తమ వాహనాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో నిలుపాలని సూచించారు. రోడ్లపై వాహనాలు నిలిపితే క్రేన్ సహాయంతో పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తామని తెలిపారు. అన్ని మండలాలు, గ్రామాల నుంచి టూ వీలర్, త్రీవీలర్స్, కార్లలో వచ్చే వారు వాహనాలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పార్కింగ్ నంబర్ వన్‌లో, జడ్పీహెచ్ఎస్ కోనా బాన్సువాడ స్కూల్ రెండో పార్కింగ్ నంబర్ 2లో, రేణుక వొకేషనల్ కళాశాల వెనుక ఖాళీ స్థలం మూడో నంబర్ పార్కింగ్‌లో నిలుపాలని పేర్కొన్నారు. స్కూల్ బస్సులు, ట్రాక్టర్లు, డీసీఎంలు, ఆర్టీసీ బస్సులు, ఇతర పెద్ద వాహనాలు బోర్లం రోడ్డులో ఉన్న వెంచర్ స్థలంలో పార్కింగ్ నంబర్ 4లో పార్కింగ్ చేయాలని తెలిపారు. హన్మాజీపేట్, కోనాపూర్, కొత్తాబాది, తిర్మలాపూర్, జేకే తండా, మొగులన్‌పల్లి, బోర్లం క్యాంపు, కొయ్యగుట్ట వైపు నుంచి వచ్చే వాహనాలు పార్కింగ్ నంబర్ 5లో ఉంచాలని తెలిపారు. బుడ్మి, తాడ్కోల్, గ్రామాల వైపు నుంచి వచ్చే వాహనాలను హెచ్‌పీ పెట్రోల్ పంపు, ఎస్ఎస్ షాపింగ్ మాల్ పక్కన పార్కింగ్ చేసుకోవాలని డీఎస్పీ వివరించారు.